## క్లుప్తంగా

### ఉచిత వైద్య శిబిరం

నేలకొండపల్లి: నూతక్కి గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. స్థానిక సీపీఎం కార్యాలయంలో నెలా నెలా నిర్వహించే ఈ వైద్య శిబిరానికి ఆదివారం మొత్తం 145 మందికి పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఏటుకూరి రామారావు, బండి పుష్పలత, బండారుపల్లి నాగేశ్వరరావు, గుడవర్తి నాగేశ్వరరావు, దండా సూర్యానారాయణ, జమాల్‌పాషా, మంకెనపల్లి నరసింహారావు, వల్లంచెట్ల భాస్కర్‌రావు, కోదండరామారావు, సోమశేఖర్, సామాల మల్లిఖార్జున్, డి.నాగేశ్వరరావు, వైద్యులు పాల్గొన్నారు.

### ఉర్సు ఉత్సవాలకు సర్వం సిద్ధం

ఖమ్మం అర్బన్: ప్రతీ ఏడాది తరహాలోనే ఈ ఏడాది కూడా హజరత్ సొండే షాహీద్ దర్గా కాల్వొడ్డు ఉర్సు ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయని ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు తెలిపారు. నేడు(సోమవారం) ఉర్సు కార్యక్రమాలు తహసీల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభంకానున్నాయని, సాయంత్రం 7 గంటలకు కందిల్, చాదర్ ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందన్నారు. అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని, ప్రజలందరూ పాల్గొని దర్గా దర్శన్ పొందొచ్చని తహసీల్దార్ తెలిపారు.

### నియామకాలు

● ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా వల్లాల యుగంధర్


వల్లాల యుగంధర్

ఖమ్మం మామిళ్లగూడెం: ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యదర్శిగా ఖమ్మానికి చెందిన వల్లాల యుగంధర్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు పసుమరి రామచంద్రరావు నియామకపత్రం అందజేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సంఘ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపి, సంఘం బలోపేతానికి కృషి చేస్తామని యుగంధర్ పేర్కొన్నారు.

● గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా రాజేష్‌నాయక్


నియామక పత్రాన్ని అందిస్తున్న రామారావు

కామేపల్లి: కామేపల్లి మండల గిరిజన మోర్చా మండల అధ్యక్షుడిగా గోవింద్రాల గ్రామానికి చెందిన బాదావత్ రాజేష్‌నాయక్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. ఈ మేరకు బీజేపీ మండలాధ్యక్షుడు జర్పల రామారావు ఆదివారం నియామక పత్రాన్ని అందించారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని రాజేష్‌నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గిరిజన రాష్ట్ర అధికార ప్రతినిధి భూక్యా శ్రీను, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పోలూరి రామచంద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, ధరావత్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్‌ను కలిసిన ప్రతినిధులు

నేలకొండపల్లి: తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాతను నేలకొండపల్లి సంఘం ప్రతినిధులు కలిసి సన్మానించారు. కల్లూరు పర్యటనలో భాగంగా ఆదివారం కలిసి వివిధ అంశాలను వివరించారు. జిల్లాలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యాన పర్మనెంట్ ప్రాజెక్టులు చేపట్టాలని, పేదలను గుర్తించి విద్య, వైద్య విషయంలో ఎక్కువ మందికి సహాయపడాలని తీర్మానించారు. ఆతర్వాత ఆర్యవైశ్య మహాసభ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నాగుబండి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా యర్రా నాగేశ్వరరావు, గరిణే వెంకటేశ్వర్లు, జిల్లా పొలిటికల్ చైర్మన్‌గా మాటూరి సుబ్రహ్మణ్యం, విద్యా కమిటీ చైర్మన్‌గా మండడపు వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా కొత్తా వేణుబాబు, దోసపాటి అచ్యుత్‌రామయ్య, తెల్లాకుల అశోక్, గోపికృష్ణ చేత ఆమె ప్రమాణాస్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రేగూరి హనుమంతరావు, దోసపాటి చంద్రశేఖర్‌లు ఉన్నారు.

# బాధ్యతగా నిర్వర్తించేలా..


శిక్షణలో కొత్తగా విధుల్లో చేరిన వసతిగృహ సంక్షేమ అధికారులు

### కొత్తగా విధుల్లో చేరిన ఎస్సీ వార్డెన్లకు శిక్షణ

- రికార్డులు రాయడం, బిల్లుల ఆన్‌లైన్ విధానంపై అవగాహన
- విద్యార్థులతో మెలిగే విధానాలపై శిక్షణ
- 18 మందికి సర్టిఫికెట్ల అందజేత

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖలో నూతనంగా విధుల్లో చేరిన వసతి గృహ సంక్షేమ అధికారులు (హెచ్‌డబ్ల్యూఓ) అత్యుత్తమ సేవలందించే దిశగా శిక్షణ ముగిసింది. వసతిగృహాల నిర్వహణ, విద్యార్థులతో మెలగాల్సిన విధానం, రికార్డులు రాయడంపై ఈ శిక్షణలో అవగాహన కల్పించారు. 30 రోజుల పాటు సాగిన ఈ ప్రత్యేక శిక్షణను సీనియర్ హెచ్‌డబ్ల్యూఓలు, అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ శిక్షణ కాలమంతా విద్యార్థుల పర్యవేక్షణ, వసతిగృహాల నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వర్తించేలా కీలక సూచనలు చేశారు. కొత్తగా విధుల్లో చేరిన 18 మంది హెచ్‌డబ్ల్యూఓలకు ఆదివారం ఖమ్మంలోని ఎస్సీ బాలుర (బీ) వసతిగృహంలో డీడీ కస్తాల సత్యనారాయణ ధ్రువపత్రాలు అందజేశారు.

**పట్టు సాధించేలా..**

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల్లో నూతనంగా విధుల్లో చేరిన వారికి సంక్షేమ శాఖల ఆధ్వర్యాన కలెక్టర్ సారథ్యంలో శిక్షణ ఇప్పించారు. వసతిగృహాల్లో విద్యార్థులతో మెలగాల్సిన విధివిధానాలు, వారి సంక్షరణతో పాటు విద్యాభివృద్ధికి అనుసరించాల్సిన అంశాలపై శిక్షణ పొందారు. వర్కర్లతో విధులు చేయించడంలో మెళకువలు, రాయాల్సిన రికార్డులపై అవగాహన కల్పించారు. ఇక ఎస్సీ డీడీ కార్యాలయంలో, బ్యాంకుల్లో, ట్రెజరీ శాఖల్లో కూడా వీరికి ప్రత్యేక శిక్షణ అందించారు.

**విద్యాభివృద్ధి కోసం..**

పేద, మధ్య తరగతి విద్యార్థులై ఉండి చదువుకునే సంక్షేమ వసతిగృహాల్లో విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించేలా శిక్షణ పూర్తి చేశారు. పాఠశాల నుంచి వసతిగృహానికి వచ్చిన తర్వాత విద్యార్థులు చదువుకునేందుకు సంక్షేమ అధికారి చేపట్టాల్సిన చర్యలను వివరించారు. ఈ శిక్షణలో వసతిగృహ నిర్వహణ ఒక భాగం అయితే విద్యార్థుల పట్ల అనుసరించాల్సిన విధానం, వారి విద్యను అభివృద్ధి చేసేందుకు చేపట్టాల్సిన చర్యలను మరోభాగంగా తెలియజేశారు.


శిక్షణ పూర్తి చేసుకున్న హెచ్‌డబ్ల్యూఓలతో ఎస్సీ డీడీ కస్తాల సత్యనారాయణ

**ఉత్తమ శిక్షణ అందించాం..**



వసతిగృహ సంక్షేమ అధికారులుగా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన వారికి శాఖపరమైన శిక్షణ అందించాం. విద్యార్థుల సంక్షేమమే ధ్యేయంగా ఉత్తమ సేవలు అందించేలా అవగాహన కల్పించాం. శాఖపరంగా నిబద్ధతతో విధులు నిర్వహించేలా కొత్త వారికి దిశానిర్దేశం చేశాం. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో జిల్లా స్థాయిలో ఒక రోజు శిక్షణను ఇవ్వడం జరిగింది.

– కస్తాల సత్యనారాయణ, ఎస్సీడీడీ

**ప్రణాళిక ప్రకారం..**



ఎస్సీడీడీ నేతృత్వాన కొత్తగా విధుల్లో చేరిన అధికారులకు 30 రోజుల పాటు ఇచ్చిన శిక్షణను ప్రణాళిక ప్రకారం పూర్తి చేశాం. క్షేత్రస్థాయిలో కొత్త వార్డెన్లను తిప్పి ఏఏ స్థాయిలో ఏఏ పనులు ఉంటాయి అనేది వివరించాం. సీనియర్ హెచ్‌డబ్ల్యూఓలతో వారి అనుభవాలను, విద్యార్థులు, తల్లిదండ్రుల పట్ల వ్యవహరించాల్సిన తీరును తెలియజేశాం.

– కోటపాటి రుక్మారావు, వసతిగృహ సంక్షేమ అధికారి, ఎస్సీ బాలుర (బీ) వసతిగృహం

**నిర్వహణకు ఉపయోగకరం..**



కొత్తగా విధుల్లో చేరిన నాకు 30 రోజుల శిక్షణ వసతిగృహ నిర్వహణకు ఉపయోగకరంగా ఉంటుంది. విద్యార్థులను నిరంతరం ఎలా పర్యవేక్షించాలి, రికార్డులు రాయడం ఎంత ముఖ్యమో తెలుసుకున్నాం. శిక్షణ సమయంలో ఎస్సీడీడీ కార్యాలయంతో పాటు ట్రెజరీ కార్యాలయం, బ్యాంకుల్లో కార్యకలాపాలపై నిశితంగా వివరించారు.

– కె.నరేందర్, వసతిగృహ సంక్షేమ అధికారి, నేలకొండపల్లి కళాశాల బాలుర వసతిగృహం

# హామీలు అమలు చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

ఖమ్మం సహకారనగర్/రఘునాథపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన రఘునాథపాలెం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ నివేదికను తెప్పించుకొని వచ్చే నెల నుంచి అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు, డీఏలు విడుదల చేయాలని, పదోన్నతులు చేపట్టాలన్నారు. కేజీబీవీ, యూఆర్‌ఎస్, ఆశ్రమ పాఠశాలల కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీసం వేతనం ఇవ్వాలని, గురుకుల పని వేళలు ఉపాధ్యాయ, విద్యార్థులకు అనుకూలంగా మార్చాలని, విద్యకు 15 శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, కేజీ తరగతులు ప్రవేశపెట్టి ప్రాథమిక విద్యను బలోపేతం చేయాలని కోరారు. 50మందికి పైబడి విద్యార్థులు ఉన్నచోట తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలన్నారు. ఉపాధ్యాయుల సర్దుబాటు పారదర్శకంగా చేపట్టాలన్నారు. సమావేశంలో నాయకులు జీ.వీ. నాగమల్లేశ్వరరావు, సక్రాం, శిరీష, శేషగిరి, కృష్ణార్జున్, రామోజీ, ప్రసాద్, రవీందర్, పాండురాజు, దాసు తదితరులు పాల్గొన్నారు.

# ● బోనమెత్తిన గువ్వలగూడెం..


గువ్వలగూడెంలో బోనమెత్తిన గ్రామస్తులతో మంత్రి పొంగులేటి సతీమణి మాధురి

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం గ్రామంలో గంగమ్మ దేవాలయం పునఃప్రతిష్టా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 5 నుంచి 8 వరకు జాతర నిర్వహించగా.. ఆదివారం ముగింపు రోజు కావడంతో మహిళలు బోనమెత్తి గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కోరట్లగూడెం, పైనంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శంకుస్థాపనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, నాయకులు రమేష్, భద్రయ్య, జెర్రిపోతుల అంజని, బచ్చలకూరి నాగరాజు, వెంకన్న, కడియాల నరేష్, చెరువు స్వర్ణ, కొమ్మినేని విజయ్‌బాబు, అడపాల రామారావు, మార్తి కోటి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

**➡ జయప్రదం చేయండి**


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘాల నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: స్థానిక సంస్థ ఎన్నికలను 42శాతం బీసీ రిజర్వేషన్ అమలు చేశాకే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న ఖమ్మంలో నిర్వహించే సదస్సును జయప్రదం చేయాలని మాజీ మార్కెట్ చైర్మన్ ఆర్‌జేసీ కృష్ణ తెలిపారు. ఆదివారం ఖమ్మంలో దీనికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శాసనమండలి సభ్యులు తీన్మార్ మల్లన్నతో పాటు జస్టిస్ చంద్రకుమార్ తదితర బహుజన మేధావులు హాజరవుతున్నారని తెలిపారు. రిజర్వేషన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం జరపబోయే జనగణనలో కులగణన అంశాన్ని కూడా ఈ సదస్సులో చర్చించనున్నామన్నారు. బహుజనుల ఆత్మగౌరవ ప్రతీకగా జరిగే ఈ సదస్సును ఖమ్మంలోని బహుజన కుల సంఘాలు.. ఆయా పార్టీలోని బహుజన మేధావర్గం అందరూ కూడా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

**➡ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన**

నేలకొండపల్లి: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండలంలోని కోనాయిగూడెంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఆదివారం శంకుస్థాపన చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతనే పేదోడి సొంతింటి కల నెరవేరుతుందన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చొరవతో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇళ్లు మంజూరు చేస్తారని,ఈకార్యక్రమం నిరంతరం జరిగే ప్రక్రియ అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొందయ్య, కొమ్మినేని పుష్పావతి, మేకల వెంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్‌బాబు, వడ్లమూడి నర్సయ్య, పాకనాటి కన్నారెడ్డి, పగడాల సైదులు తదితరులు పాల్గొన్నారు.

**➡ ప్రభుత్వ ఆస్తులు అమ్మొద్దు**

ఖమ్మం మామిళ్లగూడెం: పేదలకు స్వగృహ హౌసింగ్ ప్లాట్లతో పాటు ఖాళీ స్థలాలు ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణ శాఖ అనుబంధంగా ఉన్న రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ హౌసింగ్ బోర్డుల పరిధిలోని ఆస్తులు వేలం వేయడాన్ని కమిటీ ప్రతినిధులు తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. చాలామంది పేదలు ఇళ్ల స్థలాలు లేక, ఇళ్లు కట్టుకోలేక ఇబ్బందులు పడుతుంటే గ్రామసభల ద్వారా అర్హులైన పేదలను గుర్తించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం ఆదాయం కోసం స్వగృహ ప్లాట్లు హౌసింగ్ కాలనీలు అమ్మకానికి పెట్టడం సరైందికాదన్నారు. ఖమ్మం జిల్లాలో 8 టవర్లతో పాటు 3.38 ఎకరాల ఖాళీ స్థలాన్ని పోలేపల్లి పరిధిలో ఉన్న అర్హులైన పేదలకు, ఖమ్మం కార్పొరేషన్ ఖమ్మం చుట్టూ ఉన్న అర్హులైన పేదలను గుర్తించి పంపిణీ చేయాలని సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మెరుగు సత్యనారాయణ, పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

**➡ స్థానిక సంస్థల ఎన్నికల్లో యువతకు అవకాశం**


సమావేశంలో మాట్లాడుతున్న పాగర్తి సుధాకర్

నేలకొండపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు యువతకు అవకాశం ఇవ్వనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు పాగర్తి సుధాకర్ అన్నారు. మండలంలోని పైనంపల్లిలో నిర్వహించిన బీజేపీ యువ మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృత ప్రచారం చేసి, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని పిలుపునిచ్చారు. పంచాయతీ, ఎంపీటీసీ స్థానాల పరిధిలో సమావేశాలు నిర్వహించి ఎన్నికలకు తీసుకోవాల్సిన కార్యాచరణపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. మండలంలో యువ మోర్చాను తిరుగులేని శక్తిగా నిలపాలని సూచించారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి మల్లెబోయిన గోవిందరావు, బాజా రామకృష్ణ, సూరేపల్లి జ్ఞానరత్నం, తంగెళ్ల సతీష్, కొండా హర్ష, కందరబోయిన గోపి, మూడు రమేష్, కొండా రవి, శివ, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగుల అభ్యున్నతికి కృషి


టీస్టాల్ ప్రారంభిస్తున్న రాంబాబు

రఘునాథపాలెం: దివ్యాంగుల అభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత కృషి చేయాలని ఎస్ఆర్‌డీఎస్ ఫౌండర్ గద్దం రాంబాబు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని మంచుకొండలో టీస్టాల్‌ను ప్రారంభించాక మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో దివ్యాంగుల కమిటీలను వేయాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ఇస్తున్న సదరం సర్టిఫికెట్లలో వైద్యులు ఇష్టారీతిన దివ్యాంగుల శాతాన్ని నిర్ధేశించడంతో చాలా మంది వాస్తవ లబ్ధి పొందలేకపోతున్నారన్నారు. ఇప్పటి వరకు 80 శాతంపైగా ఉన్న దివ్యాంగులకే మూడు చక్రాల స్కూటీలు, బ్యాటరీ వీల్ చైర్లు, బ్యాటరీ ట్రైసైకిళ్ల వంటి పరికరాలు అందించేవారని, 40 శాతం అంగవైకల్యం ఉన్నవారికి కూడా ఇవి ఇవ్వాలని గత ఏడెనిమిదేళ్లుగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లిన నేపథ్యాన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర నామినేటెడ్ కమిటీల్లో ఒక్కో డైరెక్టర్ స్థాయిలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీజేఏసీ కో చైర్మన్ శివలాల్, చీఫ్ అడ్వైజర్ యాకోబుమియా, డైరెక్టర్ ఎస్‌కె.నజియా, వీరన్న, రమేష్ పాల్గొన్నారు.

### విద్యారంగ సమస్యలపై చిన్నచూపు

ఖమ్మం మామిళ్లగూడెం: విద్యారంగ సమస్యలు పరిష్కారించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు మందా సురేష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఖమ్మం జిల్లా కేంద్రం లెనిన్‌నగర్ జార్జిరెడ్డి పీడీఎస్‌యూ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యాన పాలకులు ఐదేళ్లకోసారి మారుతున్నా.. విద్య వ్యవస్థ మాత్రం పట్టించుకోవడం లేదన్నారు. గతేడాది అడ్మిషన్లు లేక జిల్లాలో 49 ప్రైమరీ పాఠశాలలు మూతబడితే.. ప్రైమరీ అనుమతులతో హైస్కూల్ బోర్డులు పెడుతూ ప్రైవేట్ – కార్పొరేటర్ విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నా అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి పర్యవేక్షణ మరిచారని ఆరోపించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో టాయిలెట్స్ నుంచి మొదలు అనేక మౌలిక సదుపాయాలు లేక, శిథిలావస్థలో ఉన్న భవనాల నడుమ విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న ప్రభుత్వాలకు నిమ్మకు నీరెత్తినట్టు వ్యహరిస్తున్నాయన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు రాచకొండ ఉదయ్, జిల్లా గర్ల్స్ కన్వీనర్ పి.శ్యామల, శ్రావణి, శ్రీధర్, సాయి, అశోక్, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.

### వివాహ వేడుకల్లో ప్రముఖులు

కూసుమంచి/తిరుమలాయపాలెం: కూసుమంచి మండలంలోని నాయకన్‌గూడెం, పాలేరు, లోక్యాతండా, చేగొమ్మ, బికారితండా గ్రామాల్లో ఆదివారం జరిగిన పలు వివాహ వేడుకల్లో మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. కాగా, మంత్రి సతీమణి వధూవరులకు నూతన వస్త్రాలను అందజేశారు. అంతేకాక మండలంలోని సీతిలితండాలో ఆదివారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తిరుమలాయపాలెం మండలంలోని తాళ్లచెరువు, మేకలతండా, సుబ్లేడు, హైదర్‌సాయిపేట, సుద్దవాగుతండా తదితర గ్రామాల్లో వివాహ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భాషబోయిన వీరన్న, ప్రధాన కార్యదర్శి దేవవరం దేవేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బానోత్ రవి (ఆర్మీ), చంద్రుతండా మాజీ సర్పంచ్ బోడా మంచానాయక్, నాయకులు స్టాలిన్‌రెడ్డి, కీసర సంకీర్త్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి

కామేపల్లి: అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. మండలంలోని బర్లగూడెం గ్రామానికి బానోత్ సక్రాం(45) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కరకవాగు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండిట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఇటీవల అనారోగ్యానికి గురై ఆదివారం పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారైలున్నారు. మృతదేహానికి వివిధ పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మాజీ సర్పంచ్ మూడ్ దుర్గాజ్యోతి, కృష్ణప్రసాద్, వడియాల కృష్ణారెడ్డి, ధరావత్ రాందాస్, మూడ్ శ్రీను, సురేష్ తదితరులు ఉన్నారు.

### పరామర్శ..

రఘునాథపాలెం: తాటి చెట్టుపై నుంచి పడిన ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న గీత కార్మికుడు పోతగాని నాగేశ్వరరావును జిల్లా ఆస్పత్రుల సమన్వయాధికారి డాక్టర్ కేశగాని రాజశేఖర్‌గౌడ్ ఆదివారం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు. మండలంలోని వీవీపాలెంకు చెందిన నాగేశ్వరరావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నాక అవసరమైన అన్ని రకాల వైద్య సేవలను అందించేందుకు తాము పూర్తిస్థాయిలో సహకరిస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మోకుదెబ్బ రాష్ట్ర కార్యదర్శి తొలపునూరి దానయ్య, పంది రాజు, గురవయ్య, శ్రీను, శివ, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

### మదన్‌లాల్ లేని లోటు తీర్చలేనిది


నివాళులర్పిస్తున్న బహుజన సంఘాల నేతలు

ఖమ్మం మామిళ్లగూడెం: బంజారా జాతీ ఓ మంచి నాయకుడిని కోల్పోయిందని, ఆయన లోటు తీర్చలేనిదని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బానోత్ భద్రునాయక్ అన్నారు. ఆదివారం ఖమ్మంలోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మదన్‌లాల్ సంతాప సభలో మదన్‌లాల్ చిత్రపటానికి నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కింది స్థాయి నుంచి ఎమ్మెల్యే స్థాయికి ఎదిగిన ఆయన బంజారా జాతి ప్రయోజనాల కోసం పనిచేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి బోడా వీరన్న, వీరనారీమణుల ఆశయసాధన సమితి జిల్లా అధ్యక్షురాలు ఉపేంద్రబాయి, బహుజన జేఏసీ కన్వీనర్ షేక్.నాజీమా, కోకన్వీనర్ నకిరెకంటి సంజీవరావు, ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు వీరన్న, రవీందర్, శ్రీనివాస్, రవి, రమేష్, నాగరాజు, వీరానారీమణుల నాయకురాళ్లు త్రివేణి, జ్యోతి, విజయ, భవాని, లక్ష్మి, లత, బహుజన జేఏసీ యూత్ అధ్యక్షుడు అఖిల్, సురేష్, నరేష్ నాయక్ పాల్గొన్నారు.

# మీకోసం సిద్ధమైనం..


కూసుమంచి చెరువు వద్ద జనం రద్దీ

మృగశిర కార్తె ప్రారంభం రోజున చేపలు తినాలనే ఆనవాయితీతో జనం చేపల కోసం బారులుదీరారు. తెల్లవారుజాము నుంచే చెరువుల వద్ద, రహదారుల వెంట, కూడళ్లకు చేరుకుని చేపల కొనుగోళ్లు చేపట్టారు. సాధారణ రోజుల్లో కిలో రూ.180 వరకు విక్రయించగా.. ఆదివారం రూ.250 వరకు పలికింది. అయినా లెక్కచేయకుండా చేపలను ఎలాగైనా తినాలని కొంటుండడంతో విక్రయదారులు ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి మరీ అమ్మారు.

– సాక్షి నెట్‌వర్క్


ఖమ్మంవ్యవసాయం: ఖమ్మం శ్రీటౌన్ మార్కెట్, రహదారి వెంట చేపల విక్రయం


ఖమ్మంవ్యవసాయం: చేపలను శుభ్రం చేసే వద్ద నిరీక్షిస్తున్న చేపల ప్రియులు

## అటెన్షన్ ప్లీజ్

# ఈ ఊరెక్కడుందబ్బా..!




రఘునాథపాలెం మండలంలోని బావోజితండా-మంచుకొండ క్రాస్ రోడ్డు వద్ద పంచాయితీరాజ్ అధికారులు గ్రామాలకు వెళ్లే బోర్డును ఏర్పాటు చేశారు. ఈ క్రాస్‌రోడ్డు నుంచి కుడి వైపు వెళ్తే చింతగుర్తి గ్రామం, ఎడమవైపు వెళ్తే బావోజితండా వస్తాయి. అయితే ఈ బోర్డులో చింతగుర్తికి బదులుగా చింతపర్తి అని బోర్డుపై ఉండడంతో ప్రయాణికులు అయోమయానికి గురవుతున్నారు. అంతేకాక మంచుకొండ గ్రామం కూడా బావోజితండా వైపుగా ఉంటే బాణంగుర్తు మాత్రం కుడివైపుకు ఇచ్చారు. ఇకనైనా అధికారులు స్పందించి బోర్డులను సరిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్